ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శనివారం 28 సెప్టెంబరు 2024




ఎర్రబారిపోయి ఎదగని పత్తి మొక్కలు

సంపత్తికి ఎసరు!

- కంటతడి మిగిల్చిన అతివృష్టి, అనావృష్టి
- వర్షాలతో చేతికందని 'తెల్లబంగారం'
- సస్యరక్షణ చర్యలు పాటించకుండా చేసిన వానలు
- భూపాలపల్లి జిల్లాలో సుమారు రూ.50కోట్ల నష్టం!

వాణిజ్య పంటల్లో పత్తి ఒకటి. రైతన్నలకు సంపత్తి తెచ్చిపెట్టేది కాబట్టి దీన్ని తెల్లబంగారం కూడా అంటారు. అయితే.. ఈ పంటకు ఇప్పుడు విపత్తు వచ్చింది. భారీ వర్షాలు ఏకదాటిగా కురవడంతో దీన్ని పండించే వారికి కంటతడే మిగిలింది. పత్తి సాగు విస్తీర్ణంలో దేశంలోనే తెలంగాణ మూడో స్థానంలో ఉండగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది భూపాలపల్లి జిల్లా రైతులు నష్టాలనే చవిచూడాల్సి వస్తోంది.

కాటారం, సెప్టెంబరు 27: భూపాలపల్లి జిల్లాలో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పత్తి సాగు అయింది. 92,759 ఎకరాల్లో రైతులు దీన్ని పండించారు. ఒక్క కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మల్హర్, మహదేవపూర్, పలిమెల మండలాల్లో 36వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో అడపదడపా కురిసిన వర్షాలతో జూన్‌లోనే రైతులు పత్తి గింజలు విత్తుకున్నారు.



వీరిలో వందలాది మంది విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో వారు మళ్లీ మళ్లీ ప్రయత్నించారు. రెండు, మూడుసార్లు విత్తుకున్నారు. దీంతో ఖర్చులు తడిసిమోపెడయ్యాయి. జూలైలో జిల్లాలోని పలు మండలాల్లో వానలు దంచికొట్టడంతో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. దీంతో పత్తి పంటలు కోలుకొనే పరిస్థితి లేకుండా పోయింది. ఆగస్టు, సెప్టెంబరు మొదటి, రెండో వారంలోనూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కుండపోతగా వర్షం పడటంతో పత్తి పంటలో ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది.

సస్యరక్షణ చేయలేక..

పత్తి పంటలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలు సకాలంలో నిర్వహించి పోషక ఎరువులను అందిస్తేనే పత్తిపంట నిజంగా తెల్లబంగారమే. అయితే.. ఈ ఏడాది పత్తి పంట ఎదిగే దశలో ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురిశాయి. దీంతో గడ్డి బాగా పెరిగి కలుపు నివారణ సాధ్యం కాలేదు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టలేకపోయారు. దీంతో చీడపీడల కారణంగా పత్తి పంటకు ఎదుగుదల లేకుండా పోయింది.

నల్లరేగడి నేలల్లో ఇబ్బందులు

పత్తి పంట సాధారణ పరిస్థితుల్లోనైతే నల్లరేగడి నేలల్లోనే అధిక దిగుబడులు ఇస్తుంది. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాల పంటే. నల్లరేగడి నేలల్లో తేమశాతం ఎక్కువగా ఉంటే మాత్రం పత్తి పంట ఎదుగుదలలో ప్రభావం చూపుతుంది. ఈ సీజన్‌లో భారీ వర్షాలతో నల్లరేగడి నేలలు నీటిని ఎక్కువగా పీల్చుకోవడంతో పత్తి పంట ఎదగని పరిస్థితి తలెత్తింది. వేలాది ఎకరాల్లో పత్తి పంటకు ఎడతెగని వర్షాలతో ఓ వైపు ఎర్రబారి పోయింది. మరోవైపు కలుపు సమస్య తీవ్రమై దిగుబడులు సరిగా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటించి, వాతావరణం అనుకూలిస్తే పత్తి చౌక నేలల్లో 7-9 క్వింటాళ్లు, నల్లరేగడి నేలల్లో 10-15 క్వింటాళ్లు దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితిలో దెబ్బతిన్న చేలల్లో ఎకరాకు 3-4 క్వింటాళ్లు కూడా దిగుబడులు రాలేదు. దీంతో పెట్టుబడులు కూడా వెళ్లవని రైతులు నైరాశ్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో చౌక నేలల్లో పత్తి పంట బాగానే ఎదిగింది. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో సుమారు 15వేల ఎకరాల్లో పత్తి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని తెలుస్తోంది. భారీ వర్షాలకు పత్తి పంట నష్టంతో రైతులు దాదాపు రూ.50కోట్లు ఆదాయం కోల్పోనున్నారు. పత్తి పంట పూర్తిగా దెబ్బతిని ఎకరాకు 1-5క్వింటాళ్ల దిగుబడు లు రాక పెట్టుబడులు వెళ్లని రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



భూమిలో అధిక తేమతో చనిపోయిన పత్తి మొక్కలు

దేశం కోసం పనిచేయడం గర్వకారణం

- కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 27: దేశం కోసం పనిచేయడం ఎంతో గర్వకారణమని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అగ్నిపథ్ స్కీం ద్వారా అగ్నివీర్ కార్యక్రమం గురించి విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా నుంచి యువత ఆర్మీ, నేవీ, ఏవియేషన్‌లో చేరి దేశానికి సేవ చేసి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. 17-21 సంవత్సరాల లోపు యువతను అగ్నిపథ్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు విద్యార్థులకు క్షుప్తంగా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఎంప్లాయిమెంట్ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలి

ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ రుణాల మంజూరు, రెన్యూవల్స్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు రుణాలు అందేలా చొరవ తీసుకోవాలన్నారు. రైతు రుణమాఫీ అయి రైతులకు తిరిగి లోన్‌లు ఇవ్వాలన్నారు. పోడు పట్టాలు ఉన్న రైతులకు రుణాలు అందించాలన్నారు. బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి రుణ లక్ష్య సాధనలో ప్రగతి సాధించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ సంవత్సరం రూ.250 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటి వరకు రూ.130 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సాధించాల్సిన లక్ష్యాలపై బ్యాంకర్లు మరింత శ్రద్ధ వహించాలన్నారు.

నిష్పక్షపాతంగా కేసుల దర్యాప్తు జరగాలి

- ఎస్పీ శబరీశ్
- పస్రా పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

గోవిందరావుపేట, సెప్టెంబరు 27: ఎఫ్ఐఆర్‌ల నమోదు, కేసు దర్యాప్తు సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ శబరీశ్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పస్రా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల నమోదు, వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రిని తనిఖీ చేసి వారి విధి నిర్వహణ సామర్థ్యాలను పరిశీలించారు. నేర పరిశోధనలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. డయల్ 100 కాల్స్‌కు సత్వరమే స్పందించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారికి కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. గ్రామ పోలీసు అధికారులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు ఎస్‌హెచ్‌వోకు తెలియపర్చాలన్నారు. స్టేషన్‌కు వస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందనే విధంగా ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించాలన్నారు. పోలీసు ఉద్యోగమంటేనే బాధ్యతతో కూడుకున్నదని, క్రమశిక్షణతో పనిచేయాలని తెలిపారు. స్టేషన్‌లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఎస్పీ పరిష్కారం కోసం ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ గీతే, డీఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, ప్రొబేషనరీ ఎస్సైలు బి.చంద్రశేఖర్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రామప్పలో ప్రపంచ పర్యాటక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామప్పలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్స్ విజయ్‌కుమార్, వెంకటేష్, సేవ టూరిజం వలంటీర్స్ శ్రీకాంత్, జగదీశ్, పర్యాటకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అక్రమాలు?

- డ్యూటీలు చేయని వారికి డబ్బులు చెల్లింపు
- డ్యూటీ చేసిన సిబ్బంది నుంచి అక్రమ వసూళ్లు

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 27: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయి. విధులు నిర్వహించని ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తూ కమీషన్లు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు భూపాలపల్లి జిల్లాలోని ఉద్యోగులకు ఎన్నికల విధులను కేటాయించారు. ఎన్నికల విధులు చేసిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ శాఖల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ఎన్నికల విధులను కేటాయించారు. ఎన్నికల విధులు చేసే ఉద్యోగులకు సాధారణ జీతంతో పాటు ఒక నెల వేతనం అదనంగా అందిస్తారు. అయితే కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు ఎన్నికల విధులు చేయకున్నా డబ్బులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. మరోవైపు కలెక్టరేట్‌లో పనిచేసే ఇద్దరు ఉద్యోగులకు ఎలక్షన్ డ్యూటీ చేయకున్నా వేతనం అందించడంతో ఈ విషయం తెలుసుకున్న ఒక ఉద్యోగి హడావిడి చేసి తను వేతనం పొందినట్లు తెలిసింది. దీంతో పాటు ఉద్యోగులకు చెల్లించిన వేతనంలో కలెక్టరేట్‌లో ఇటీవల కొలువుదీరిన ఉద్యోగి కమీషన్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. కమీషన్లు ఇవ్వని ఉద్యోగులను వేధిస్తున్నట్లు తెలిసింది. కమీషన్ల వ్యవహారం కలెక్టర్ రాహుల్‌శర్మ దృష్టికి తీసుకువెళ్తే తమకు ఉద్యోగ భద్రత ఉండదని సదరు ఉద్యోగులు ఇతర ఉద్యోగుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ రాహుల్‌శర్మను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

'మేడిగడ్డ' నిర్మాణ సంస్థకు గుబులు

- బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దుతో కలవరం
- తొలుత మరమ్మతులను నిరాకరించిన ఎల్అండ్‌టీ
- రూ.500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన..
- ఆతర్వాత రూ.155 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు
- వ్యూహాత్మకంగా కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దు చేసిన ప్రభుత్వం
- సర్కారు నిర్ణయంతో పూర్తి ఖర్చు నిర్మాణ సంస్థపైనే?
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతుల ఖర్చు భరించిన నిర్మాణ సంస్థలు



మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ప్రాంతం

వివరాలు 7లో..

అటవీ అధికారులపై రాడ్లతో దాడి

- 'పోడు'ను అడ్డుకునేందుకు వెళ్లిన క్రమంలో దుండగుల దుశ్చర్య
- తాడ్వాయి మండలం దామెరవాయి వద్ద ఘటన
- ఎక్స్‌కవేటర్ యజమాని సహా ఐదుగురిపై కేసు
- ఐదుగురు నిందితుల అరెస్టు
- బాధితులకు మంత్రులు సీతక్క, సురేఖ పరామర్శ

వివరాలు 7వ పేజీలో..



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్ర

పర్యాటక అభివృద్ధిపై కేంద్ర కన్సల్టెంట్ నిర్వాహకుల పర్యటన

మహదేవపూర్, సెప్టెంబరు 27: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో కాళేశ్వరం అభివృద్ధిపై రూపకల్పన కొనసాగుతోంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం దేవాదాయ, ధర్మాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ కమిషనర్ హనుమంతరావు పర్యటించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో శుక్రవారం కేంద్ర కన్సల్టెన్సీ బృందం తానిషాతో పాటు నలుగురు సభ్యులు పర్యటించారు. కాళేశ్వరంలో పుష్కర ఘాట్లు, వీఐపీ ఘాట్ ఆలయం, శ్రాద్ధ కార్యక్రమాలు నిర్వహించే పలు ప్రాంతాలను సందర్శించారు. కాళేశ్వర ప్రాంతాన్ని పర్యాటకంగా ఏ విధంగా అభివృద్ధి చేయాలని పునరాలోచించారు. రహదారి వెడల్పు, స్నానపు గదులు తదితర అంశాలపై ఈ బృందం నివేదిక ఇవ్వనుంది. కాళేశ్వరంతో పాటు మంథని, రామగిరి ప్రాంతాలను సైతం పరిశీలన చేసినట్లు కన్సల్టెన్సీ నిర్వాహకులు తెలిపారు.

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

జయంతి కార్యక్రమంలో ములుగు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 27: స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజలు, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు శుక్రవారం ములుగులో ఘనంగా జరిగాయి. స్థానిక సంక్షేమ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసిన కలెక్టర్ నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆయన నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. బ్రిటిష్ పాలకులు ఎన్ని శిక్షలు విధించినా భయపడకుండా పోరాటంలో ముందుకు కదిలారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. బీసీ కులాల వర్గీకరణ సమయంలో అన్ని కులాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సీహెచ్.రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, పద్మశాలీ కుల సంఘం నాయకులు డీపీ.జనార్దన్, గుర్రపు శ్రీధర్, చిందం రాజమల్లు, కందకట్ల సారయ్య, బీసీ కులాల సంఘ నాయకుడు ముంజాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్‌లో..

భూపాలపల్లి కలెక్టరేట్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఆయన పాత్ర కీలకమన్నారు. స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటాలు చరిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీకి గొప్ప చరిత్ర ఉందని, నిస్వార్థపరుడు, నిజాయితీపరుడని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభాలకు అనుగుణంగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.



ములుగులో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర, బీసీ సంఘాల నేతలు

కేయూ భూముల వివాదంలో అశోక్‌బాబుకు షోకాజ్ నోటీసులు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 27: కేయూ భూముల సర్వేపై వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారాలు చేసిన ఆర్ట్‌అండ్‌సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఏఆర్) పెండ్లి అశోక్‌బాబుకు కేయూ రిజిస్ట్రార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేయూ అధ్యాపక సంఘం (ఆకుట్), విద్యార్థి సంఘాల ఫిర్యాదు మేరకు సర్వేనెంబర్ 229లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. 2020లో కేయూ భూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా ఉన్న పెండ్లి అశోక్‌బాబుకు తన ఇళ్లు కేయూ భూమిలో ఉందని తెలిసి కూడా తనకు తాను కమిటీ నుంచి వైదొలగకుండా కమిటీతో ఉద్దేశకపూర్వకంగానే సన్నిహితంగా ఉన్నాడని నోటీసులో పేర్కొన్నారు. 2023లో ఆయన కమిటీ కన్వీనర్ బాధ్యతల నుంచి తొలిగించి విజిలెన్స్, మునిపాలిటీ, రెవెన్యూ ఆధ్వర్యంలో సర్వే చేయగా 229 సర్వేనెంబర్‌లో పెండ్లి అశోక్‌బాబుతోపాటు, మరి కొంత మంది నిర్మాణం చేసినట్లు గుర్తించారు. కాగా, బాధ్యతాయుతమైన ఉద్యోగిగా ఉండి కేయూ భూమిలో ఇళ్లు నిర్మాణం చేయడమే కాకుండా సర్వే సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే విధంగా తప్పుడు ప్రచారాలు చేసిన అశోక్‌బాబుపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు.

127 కిలోల గంజాయి పట్టివేత

గాలివారి గూడెంలో రూ.31.75 లక్షల విలువైన సరుకు స్వాధీనం



మరిపెడలో మాట్లాడుతున్న మానుకోట ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27 : గంజాయిపై మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు హైఅలర్ట్‌గా ఉంటుందని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. మత్తుపదార్థాల విక్రయం, రవాణా చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. శుక్రవారం మరిపెడ మండలం గాలివారిగూడెం ఏఎన్ఆర్ గార్డెన్ దగ్గర మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తన సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా ఓ కారులో సీలేరు నుంచి హైదరాబాద్‌కు 127 కిలోల శుద్ధి చేసిన గంజాయి తరలిస్తుండగా పట్టుబడింది. ఎస్పీ మరిపెడ పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కుంటా మండలం అసీర్‌గూడెంకు చెందిన రెవెన్యూ ఉద్యోగి సోడి నాగేశ్వర్‌రావు క్విడ్ రినాల్ట్ కారులో శుద్ధిచేసిన 62 ప్యాకెట్లు (127 కిలోల) గంజాయిని సీలేరు నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో మరిపెడ పోలీసులకు చిక్కారు. గంజాయిని, ఆ కారు సీజ్‌చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.31.75 లక్షలు ఉంటుదని ఎస్పీ పేర్కొన్నారు. స్థానిక ఎస్సైలు సతీశ్‌గౌడ్, సంతోష్, ట్రైనీ ఎస్సై అశోక్‌ను ప్రశంసించి, రివార్డు అందచేశారు. పలువురు పీసీలకు సైతం నగదు పారితోషకం అందించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూడో పోటీల్లో గురుకుల విద్యార్థులకు స్వర్ణ పతకాలు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులు

మడికొండ, సెప్టెంబరు 27: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో ఈనెల 25, 26 తేదీలలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు స్వర్ణపతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వ రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14 విభాగంలో జి. దీపిక, కె. సహజ, తహసీయత, హిమవర్షిణి స్వర్ణపతకాలు, కె. సహస్ర కాంస్య పతకం సాధించారన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థినులు అక్టోబరు 3 నుంచి 7 వరకు గుజరాత్‌లోని మెహసాన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్పష్టం చేశారు. ఈసందర్భంగా జూడో శిక్షకులు నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరిత సహకరించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందాన్ని, పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

సుదీర్ఘకాలం తర్వాత బదిలీలు.. జారీ అయిన మార్గదర్శకాలు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) పరిధిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేశారు. ఒకే చోట రెండేళ్లకు మించి పనిచేస్తున్న ఉద్యోగులను మొత్తం క్యాడర్ స్ట్రెంత్‌లో 50శాతం మించకుండా బదిలీ చేస్తారు. వివిధ ఉద్యోగు సంఘాల్లో పని చేస్తున్న జిల్లా స్థాయి ప్రతినిధులు, ఇంకో ఏడాదిలో రిటైర్ అయ్యే ఉద్యోగులు, భార్యాభర్తలయిన ఉద్యోగులు (స్పౌజ్ కేసు), దివ్యాంగులైన ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, ప్రత్యేకావసరాల పిల్లలు కలిగిన ఉద్యోగులకు బదిలీల్లో వెసులుబాటును కల్పించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని పదహారు జిల్లాల్లో వివిధ కేడర్లలో బదిలీ అయ్యే అవకాశం ఉన్నవారి వివరాలతో కూడిన జాబితాను ఈనెల 28వ తేదీన అన్ని సర్కిల్ కార్యాలయాల్లో అలాగే ఎంప్లాయిస్ ట్రాన్స్‌ఫర్ పోర్టల్‌లో ప్రదర్శిస్తారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 30వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉద్యోగుల నుంచి బదిలీల్లో ఐచ్ఛికాలను పేర్కొంటూ దరఖాస్తులను అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5.30గంటల వరకు స్వీకరిస్తారు. అక్టోబర్ 7వ తేదీన బదిలీ ఉత్తర్వులను జారీ చేస్తారు. బదిలీ అయిన ఉద్యోగులంతా అక్టోబర్ 9వ తేదీలోగా రిలీవ్ కావలసి ఉంటుంది. బదిలీలపై నిషేధం మళ్లీ అక్టోబర్ 8వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. నిషేధం అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రత్యేకమైన కేసుల్లో మినహా ఇక ఎలాంటి బదిలీలు ఉండవు.

బదిలీ అయ్యే ఉద్యోగులు

డివిజనల్ క్యాడర్ ఉద్యోగులు అయిన లైన్ ఇన్‌స్పెక్టర్లు మొదలు కొని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఉద్యోగులను వారు ప్రస్తుతం పనిచేస్తున్న సెక్షన్ నుంచి బయటి సెక్షన్‌కు డివిజనల్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. సర్కిల్ కేడర్ ఉద్యోగులైన సబ్‌ఇంజనీర్లు, జేఏవో, ఎఫ్ఎం, ఎస్ఎల్ఐ, జనరల్ సర్వీస్‌లో పనిచేస్తున్న సిబ్బంది మొదలు అకౌంటింగ్ విభాగంలో పని చేసే ఉద్యోగులను అదే సర్కిల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న సబ్ డివిజన్ నుంచి మరో డివిజన్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ బదిలీ చేస్తారు. అలాగే హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న జేఏవోలు మొదలు.. సబ్ ఇంజనీర్ల వరకు వివిధ సెక్షన్లకు లేదా వివిధ ప్రదేశాలు, విభాగాలకు కార్పొరేట్ కార్యాలయం సంబంధిత ఉన్నతాధికారి బదిలీ చేస్తారు. 2024 జూన్ 30వ తేదీ నాటికి ఒకే చోట రెండేళ్లు పని చేసిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) క్యాడర్ ఉద్యోగులను సూపరింటెండెంట్ సర్కిల్‌పరిధిలోని వివిధ డివిజన్లకు, కార్పొరేట్ కార్యాలయం బయటి సర్కిల్‌కు బదిలీ చేస్తారు.

కార్పొరేట్ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అయిన ఏఈ, ఏఏఈ, ఏడీఈ (ఎలక్ట్రికల్) ఉద్యోగులను హెడ్‌క్వార్టర్ బయటకు, లేదా సర్కిల్ బయటకు బదిలీ చేస్తారు. అలాగే ఏఈ, ఏఏఈ (సివిల్) అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లను ఇదే సర్కిల్ లేదా వారి అభ్యర్థన మేరకు బయట సర్కిల్‌కు బదిలీ చేస్తారు. ఏఈఈ (సివిల్) డివిజనల్ ఇంజనీర్ ఉద్యోగులను వారు పని చేస్తున్న సర్కిల్ పరిధిలో లేదా బయట సర్కిల్‌లోని వేరే ప్రాంతాలకు బదిలీ చేస్తారు. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్లను సర్కిల్ బయట వేరు వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తారు. పీఅండ్‌జీ సర్వీస్‌కు సంబంధించిన అసిస్టెంట్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్రెటరీ ఉద్యోగులను కార్పొరేట్ కార్యాలయంలో లేదా సర్కిల్‌లోని వేరే సెక్షన్లలోకి బదిలీ చేస్తారు ఉద్యోగుల బదిలీలు నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా జరుగుతాయని, బదిలీల సందర్భంగా ఉద్యోగులు పైరవీలకు పాల్పడినా, లేదా ఎవరికైనా లంచాలు ఇచ్చినా అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్టు సీఎండీ వరుణ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రలోభాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.



భద్రకాళి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భద్రకాళి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 27: ప్రసిద్ధిగాంచిన వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆలయ ఈవో శేష భారతి, అర్చకులు భద్రకాళి శేషు సీఎంను కలిసి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 12వరకు జరిగే దేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎం ను కోరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

అఖిల భారత పద్మశాలీ సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం



బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈగ మల్లేశం

ఆటోనగర్, సెప్టెంబరు 27: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గ్రేటర్ వరంగల్ కొత్తవాడలో బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. మల్లేశం బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో 1915వ సంవత్సరం సెప్టెంబరు 27న జన్మించాడని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో బాపూజీ చురుకుగా పాల్గొన్నాడన్నారు. 1952లో ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించి, ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా ఎన్నికై 1971 వరకు కొనసాగారన్నారు. బాపూజీ 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలివేశాడని కొనియాడారు. సెప్టెంబరు 21, 2012లో హైదరాబాద్‌లో బాపూజీ 97 సంవత్సరాల వయస్సులో మరణించాడని తెలిపారు. బాపూజీకి భారతరత్న దక్కాలని అవసరమైన సిఫారసులను తెలంగాణ ప్రభుత్వం చేపట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసినట్టు మల్లేశం తెలిపారు. భావి తరాలకు బాపూజీ జీవిత చరిత్ర తెలసే విధంగా పాఠ్యాంశాలలో పొందుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గుండు ప్రభాకర్, వడ్నాల నరేందర్, గుండేటి నరేంద్రకుమార్, ఆడేపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 27: ఆవోపా హనుమకొండ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికిగాను బంగారు పతకాలను అందించనున్నట్లు ఆవోపా అధ్యక్షులు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దేను సదానందంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 2023- 24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు 61 కోర్సులకు ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆవోపా హనుమకొండ సుబేదారిలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 9440636447, 9949875510 నెంబర్లలో సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

'మేడిగడ్డ' నిర్మాణ సంస్థకు గుబులు

● బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దుతో కలవరం ● తొలుత మరమ్మతులను నిరాకరించిన ఎల్‌అండ్‌టీ
● రూ.500 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన.. ● ఆతర్వాత రూ.155 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు



మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో బ్యారేజీ నిర్మాణ సంస్థలో గుబులు మొదలైంది. ఇప్పటి వరకు బ్యారేజీ తాత్కాలిక మరమ్మతుల కోసం వెచ్చించిన రూపాయలతో పాటు శాశ్వత మరమ్మతుల భారం నిర్మాణ సంస్థపైనే పడుతుందనే ఆందోళనలో పడింది. తొలుత బ్యారేజీ కుంగుబాటుకు గురికాగా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతుల కోసం రూ.500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ ప్రతిపాదించింది. కానీ, నిర్మాణ సంస్థే ఖర్చులు భరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోతే కుంగుబాటు మరింత విస్తరించే అవకాశం ఉందని నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ భావించింది. తాత్కాలిక మరమ్మతులకు ఉపక్రమించి పనులు చేపట్టింది. అయితే తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.155 కోట్లు వెచ్చించడంతో పాటు ఇతర పరీక్షల నిమిత్తం ఆ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయడంతో ఆ భారం నిర్మాణ సంస్థే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంప్లీషన్ సర్టిఫికెట్ రద్దు కావడంతో బ్యారేజీ శాశ్వత మరమ్మతుల భారం తమపైనే పడుతుందని నిర్మాణ సంస్థ ఆందోళనలో పడినట్టు తెలిసింది. అయితే.. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్ కంపెనీ, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ మరమ్మత్తుల కోసం పెట్టిన ఖర్చుల మొత్తాన్ని భరించాయి. కానీ, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ మాత్రం తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత మరమ్మతులకు అవసరమయ్యే మొత్తం నిధులు విడుదల చేయాలని కోరింది. ఇదిలా ఉంటే లింక్-1లోని సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో పరీక్షల నిమిత్తం ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించింది. కాగా, కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులు ఎవరనే చర్చ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ఘటనతో నిర్మాణ సంస్థ రూ.10వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులను కోల్పోయినట్లు సమాచారం.

అధికారుల్లో ఆందోళన

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నేథప్యంలో సంబంధిత ఇంజనీర్లపై కాళేశ్వరం ఎంక్వైరీ కమిషన్ క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్న వార్తల నేపథ్యంలో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఏఈఈ నుంచి ఈఎన్‌సీ వరకు సుమారు 20 మంది ఇంజనీర్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుండటంతో టెన్షన్ నెలకొంది. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తికాకున్నా అయినట్లు ఇచ్చిన కంప్లీషన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం రద్దు చేయడంతో ఇక తమపై చర్యలు తప్పవనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్‌తో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఎవరనే చర్చ మొదలైంది.

ఆర్‌అండ్‌బీలో లంచావతారులు

● పెట్రోల్ బంక్ ఎన్‌వోసీ కోసం లంచం డిమాండ్ ● డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన జనగామ ఈఈ, ఏటీవో



జనగామ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్లు, భవనాల శాఖలోని ఇద్దరు లంచావతారులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఎన్‌వోసీ జారీ విషయంలో లంచం తీసుకుంటూ ఓ ఈఈ, ఏటీవో అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన జనగామ కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి చిర్ర సత్యపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి సతీమణి నీల పేరిట లింగాలఘనపురంలో ఆరు నెలల క్రితం ఓ కంపెనీ పెట్రోల్ బంక్ మంజూరైంది. బంక్ ఏర్పాటు చేసేందుకు గానూ నిబంధనల ప్రకారం జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈ, జనగామ ఏసీపీ నుంచి 'నో అబ్జక్షన్'(ఎన్‌వోసీ) తీసుకురావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎన్‌వోసీ కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుస్సేన్‌ను చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇటీవల సంప్రదించగా ఎన్‌వోసీ జారీ చేయాలంటే రూ.17 వేలు ఇవ్వాలని హుస్సేన్ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రకించారు. దాంతో ఏసీబీ అధికారుల పథకం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో హుస్సేన్‌కు సత్యపాల్‌రెడ్డి రూ.12వేలు ఇవ్వగా.. కార్యాలయంలో పనిచేసే అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌కు కూడా రూ.2వేలు ఇవ్వాలని హుస్సేన్ సూచించారు. దీంతో సత్యపాల్‌రెడ్డి ఇద్దరికీ లంచం ఇచ్చాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు హుస్సేన్, రవీందర్‌ను అదుపులోకి తీసుకుని, వారు సత్యపాల్‌రెడ్డి నుంచి లంచంగా తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఈఈ హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.


కాగా.. కలెక్టరేట్‌లో ఏసీబీ దాడులతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు హుస్సేన్, ఏటీవో రవీందర్ ఏసీబీకి చిక్కారన్న వార్తతో అధికారులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



మృతి చెందిన మల్లం యాకయ్య

మంత్రాల నెపంతో వృద్ధుడి దారుణ హత్య

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలో ఘటన



మల్లం యాకయ్య (ఫైల్)

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 27: మూఢవిశ్వాసాలు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. అనారోగ్యానికి గురైనా, ఇంట్లో మంచి జరుగకపోయినా మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో అమాయకులను చంపుతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో శుక్రవారం జరిగిన ఓవృద్ధుడి హత్యే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనకు సంబంధించి తొర్రూరు సీఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య (70) ఏళ్ల వృద్ధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. అదే గ్రామానికి మల్లం రాజు అనే వ్యక్తి తరుచూ జ్వరంతో అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ అనారోగ్యానికి కారణం యాకయ్య అని, తనకు మంత్రాలు చేయడంతోనే రోగాల బారిన పడుతున్నానని, ఆయనను చంపాలని నిర్ణయించుకున్నాడు. చిన్నముప్పారం గ్రామశివారుకు వెళ్తున్న సమయంలో ఉదయం ముత్యాలమ్మగుడి వద్ద మాటువేసి, అటుగా వస్తున్న యాకయ్య తలపై మంచం కర్రతో కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యాకయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐజగదీష్ వివరించారు. కాగా, రాజును గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య సోమక్క, కుమారుడు రమేష్, కుమార్తె ఉన్నారు. కుమారుడు రమేష్ ఫిర్యాదుమేరకు నిందితుడు రాజుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యాకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

పీఆర్‌సీ ఫిట్‌మెంట్ నివేదికను సమర్పించాలి

హనుమకొండటౌన్, సెప్టెంబర్ 27: 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ నివేదికను సమర్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్-గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేసి 5శాతం ఐఆర్ ప్రకటించిందన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి నివేదిక సమర్పించలేదని, ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నందున నివేదిక సమర్పించాలన్నారు. జోనల్ వ్యవస్థను రద్దుచేసి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సీనియారిటీ లిస్టులు తయారు చేసి ఉద్యోగులు నష్టపోకుండా చూడాలన్నారు.

కాకతీయుల కట్టడాలను పరిరక్షించాలి

● ఎంపీ నిధులతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి
● ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ఎంపీ కడియం కావ్య ● కోటలో ఘనంగా కార్యక్రమం



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ కడియం కావ్య

ఖిలావరంగల్, సెప్టెంబరు 27: కాకతీయుల అద్భుత కట్టడాలు, కళాఖండాలను పరిరక్షించాలని, వాటి ఔన్నత్యాన్ని ముందుతరాలకు తెలియజేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోటలో వరంగల్ జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాకతీయ రాజులు దక్షిణ భారతదేశం, ఓరుగల్లు సామ్రాజ్యాన్ని సుమారు 300 ఏళ్ల పరిపాలించారన్నారు. వారికాలంలో పరిపాలనతోపాటు యుద్ధవిద్యలు, కళలు, అద్భుత కళాఖండాలను నిర్మించారన్నారు. కాకతీయుల చరిత్ర చాలా గొప్పదని, విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. తన నిధుల నుంచి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానన్నారు.


కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక రంగాల్లో పర్యాటక రంగంపై అవగాహన కలిగి, సంస్కృతులను గౌరవించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. జిల్లాలోని పర్యాటక పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి కాకతీయుల అద్భుత కళాఖండాలు, శిల్పాసౌందర్యాల ప్రాశస్త్యంపై అవగాహన కలిగిఉండాలన్నారు. హాస్పిటాలిటీ సెక్టార్‌లో నైపుణ్యం కలిగిన టూరిస్టు గైడ్‌లుగా, వలంటీర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడం చాలా అవసరమన్నారు. ప్రతీ కళాశాల, పాఠశాలలో ఒక ప్రత్యేక టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి, వాటి పనితీరుపై బాధ్యత వహించేలా ఫ్యాకల్టీ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్‌లను ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు కాకతీయ రాజుల కళాఖండాలు, శిల్పసౌదంర్యాల గురించి కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖల సిబ్బంది శ్రీకాంత్, రవియాదవ్‌లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఖిలావరంగల్‌కు వచ్చిన ఎంపీ కావ్యకు కలెక్టర్ స్వాగతం పలికారు. ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు కళాశాల, పాఠశాల విద్యార్థులు, అధికా రులు, టూరిజం యూత్ క్లబ్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా టూరిజం అధికారి శివాజీ, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్, ఖిలావరంగల్ మండల తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాధికారులు, వివిధ శాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలోని విద్యార్థులను కాకతీయ కట్టడాలను శుక్రవారం సందర్శించారు. కోట, వేయిస్థంభాల దేవాలయం, భద్రకాళీ దేవాలయ తదితర ప్రాంతాలను టూరిజం ప్యాకేజీలో భాగంగా పర్యటించగా, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ 80మంది విద్యార్థులకు కాకతీయుల చరిత్రను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



విజేందర్(ఫైల్)



తండ్రి అంత్యక్రియల్లో కూతుర్లు

శంభునిపేట, సెప్టెంబరు 27: ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మామునూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణవేణి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన దబ్బెట వెంకటయ్య, కట్టమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు. చిన్నకుమారుడు దబ్బెట విజేందర్ (32) 2012లో కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యాడు. కుటుంబ సభ్యులతో రంగశాయిపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న విజేందర్ ప్రస్తుతం తొర్రూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున విజేందర్ విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై రంగశాయిపేటకు బయలుదేరాడు. తొర్రూరు మండలం దంతాలపల్లి నుంచి కర్రలోడుతో నగరానికి వస్తున్న ట్రాక్టర్‌లోని కొన్ని దుంగలు మామునూరు చెరువు కట్ట వద్ద కిందపడ్డాయి. ట్రాక్టర్ డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా అలాగే ముందుకు వెళ్లి పోయాడు. దీంతో అదే సమయంలో వెనుకాలే ద్విచక్రవాహనంపై వస్తున్న విజేందర్‌రెడ్డి దుంగలను ఢీకొట్టి అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మామునూరు ఎస్‌ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. విజేందర్‌కు భార్య శ్రావణి, ఇద్దరు కూతుర్లు శాన్వి, విస్సీలు ఉన్నారు. శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అధికారులపై రాడ్లతో దాడి

'పోడు'ను అడ్డుకునేందుకు వెళ్లిన క్రమంలో దుండగుల దుశ్చర్య

తాడ్వాయి మండలం దామెరవాయి వద్ద ఘటన

ఎక్స్‌కవేటర్ యజమాని సహా ఐదుగురి అరెస్టు



హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అటవీశాఖ అధికారులను పరామర్శిస్తున్న రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

తాడ్వాయి / ములుగు/ ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 27: అటవీ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ సాయంతో పోడు చేస్తుండగా అడ్డుకున్న అటవీఅధికారులపై ఆ ఎక్స్‌కవేటర్ యజమాని, అతని అనుచరులు ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ సెక్షన్, ఓ బీట్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామెరవాయి సమీపంలో గురువారం రాత్రి 11.30గంటల సమయంలో జరిగిన ఈ ఘటన గురించి పోలీసులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామెరవాయి సమీపంలోని అటవీ భూమిలో కొందరు వ్యక్తులు యంత్రాలతో చెట్లను తొలగించి పోడు చేస్తున్నారని తెలుసుకున్న సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారులు శరత్‌చంద్ర, సుమన్, బేస్‌క్యాంపు ఉద్యోగి ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్ గురువారం రాత్రి ఆ ప్రాంతానికి జీపులో వెళ్లారు. ఈ క్రమంలో ఎక్స్‌కవేటర్‌తో యజమాని గంట సూరజ్‌రెడ్డి వారికి ఎదురురాగా.. అతడిని విచారించిన అధికారులు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని తాడ్వాయి రేంజ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ లోపు విషయం తెలుసుకున్న సూరజ్‌రెడ్డి అనుచరులు అక్కడకు చేరుకుని అధికారుల వాహనాలకు అడ్డు తగిలారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం మొదలై అది కాస్తా పెద్దదైంది. ఈ క్రమంలో సూరజ్‌రెడ్డి, అతని అనుచరులు ఇనుప రాడ్లతో అటవీశాఖ అధికారులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఎఫ్ఎస్‌వో వినోద్‌కుమార్, ఎఫ్‌బీవో శరత్‌చంద్ర తలలు పగలడంతోపాటు చేతివేళ్లు విరిగాయి. అటవీశాఖకు చెందిన జీపును కూడా వారు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న తాడ్వాయి పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి గాయపడ్డ అటవీ అధికారులను తాడ్వాయి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తాడ్వాయి డిప్యూటీ రేంజ్ అధికారి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనలో గంట శశిధర్ అనే వ్యక్తికి కూడా గాయాలవగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోడు చేసేందుకు ఉపయోగించారని అనుమానంతో పోలీసులు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉంటే ఆ యంత్రంతో అటవీ ప్రాంతంలో చెట్లను తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. దామెరవాయికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిలో గతంలో జామాయిల్ చెట్లను పెంచగా వాటిని కోసిన అనంతరం భూమిలో ఉన్న మోట్లను తొలగించి చదును చేసేందుకు ఆ యంత్రాన్ని కిరాయికి తెచ్చుకున్నాడని తెలిపారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత పని ముగించుకొని వస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులు అడ్డుకోగా అది ఘర్షణకు దారితీసిందని చెబుతున్నారు. అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడ్డ వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధికారులు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెక్షన్, బీట్ అధికారులను వారు పరామర్శించారు. ఇక నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ, కలెక్టర్

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా దాడికి పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్, పీడీ యాక్టు సైతం నమోదు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీష్ వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. ఇక అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై దాడి చేసిన కేసులో గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్‌రెడ్డి, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటి అనే వ్యక్తులను శుక్రవారం సాయంత్రం కాటాపూర్ క్రాస్‌వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ శబరీశ్ వెల్లడించారు.

ఫోన్‌లో సీతక్క పరామర్శ

దామెరవాయి దగ్గర జరిగిన దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందున్న అటవీశాఖ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రలను మంత్రి సీతక్క శుక్రవారం ఫోన్‌లో పరామర్శించారు. సీసీఎఫ్, డీఎఫ్‌వోలతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకోవడంతో పాటు గాయపడిన అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఫారెస్టు అధికారులకు మంత్రి సురేఖ పరామర్శ

రెడ్డికాలనీ, సెప్టెంబరు 27: ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ దామరవాయి బీట్ -2 అటవీ ప్రాంతంలో దుండగులు చేసిన దాడిలో గాయపడి ములుగురోడ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ శరత్‌చంద్రలను అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. శుక్రవారం ఆ ఆస్పత్రికి వెళ్లిన మంత్రి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. దాడికి దారి తీసిన పరిస్థితులను డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్ మంత్రి సురేఖకు వివరించారు. అధికారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణే ధ్యేయంగా సైనికుల్లా పోరాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేసే వారు ఏ స్థాయి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అటవీశాఖ అధికారులపై జరుగుతున్న దాడులు, వారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని, ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తానని మంత్రి తెలిపారు.

నలుగురు వ్యక్తులపై ఫారెస్టు అధికారుల దాడి



ఫారెస్టు అధికారుల దాడిలో గాయపడ్డ మహాముత్తారం ఎస్సీ కాలనీ వాసులు

మహాముత్తారం ఎస్సీకాలనీకి చెందిన వ్యక్తికి తీవ్ర గాయం

మహాముత్తారం, సెప్టెంబరు 27: మహాముత్తారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తోటపల్లి సమ్మయ్య, రామిండ్ల సురేష్, మంతెన రాజబాపు, గంధం ఎంకయ్య అనే వ్యక్తులపై శుక్రవారం మధ్యాహ్నం ఫారెస్టు అధికారులు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వంట చెరకు కోసం అడవికి వెళ్లిన తాము కట్టెలు పోగు చేసుకుంటుండగా ఇద్దరు ఫారెస్టు అధికారులు వచ్చి తమను అకారణంగా కర్రలతో కొట్టారని తెలిపారు. తాము కట్టెలు సేకరించేందుకు వెళ్లిన ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో పోడు జరుగుతున్నా పట్టించుకోని ఫారెస్టు అధికారులు వంట చెరకు కోసం వెళ్లిన తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఫారెస్టు అధికారులపై మహాముత్తారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏఎస్సై మహేందర్‌ను సంప్రదించగా ఫారెస్టు అధికారులు దాడి చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఘటనలో తోటపెల్లి సమ్మయ్య చేయి విరగ్గా, మిగిలిన వారికి గాయాలవగా భూపాలపల్లి ఆస్పత్రికి తరలించామన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 2.12 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 3.40 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

ఎడవెల్లిలో జియోలాజికల్ సర్వే

మహదేవపూర్, సెప్టెంబరు 27: మహదేవపూర్ మండలం గోదావరి తీర ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వేను అధికారులు చేపడుతున్నారు. మండలంలోని ఎడవల్లి శివారు ప్రాంతంలో జియోలాజికల్ సర్వే కొనసాగిస్తున్నారు. పలుచోట్ల డ్రిల్లింగ్ చేసి లోతైన రంధ్రాల ద్వారా మట్టి నమూనాలను సేకరించి పరీక్షలను నిర్వహిసున్నారు. ఈ ప్రాంతంలో నేల స్వభావం, నీటి లభ్యత, ఖనిజ నిక్షేపాలు ఉన్నాయా అని సర్వే చేస్తున్నారు. మరో 10 రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుంది. ఆ తర్వాత బొమ్మాపురంలో చేపట్టనున్నారు.

టీజీఎండీసీ పీవోగా శ్రీరాములు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 27: తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టు అధికారిగా కె.శ్రీరాములు నియమితులయ్యారు. మహదేవపూర్, పలిమెల, మల్హర్ మండలాల పరిధిలో ఉన్న క్వారీల నిర్వహణ ఈయన పరిశీలించనున్నారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన తారక్‌నాథ్‌ను టీజీఎండీసీ హైదరాబాద్ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు టీజీఎండీసీ అధికారులు శుక్రవారం తెలిపారు. కాగా, ఇంతకు ముందున్న పీవో క్వారీల్లో వచ్చే సమస్యలపై స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), సెప్టెంబరు 27: సీసీ కెమెరాల ఏర్పాటుకు తప్పక ముందుకు రావాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో వర్తక, వాణిజ్య యజమానులతో సీసీ కెమెరాల ఆవశ్యకత, ఉపయోగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రతీ దుకాణం ఎదుట, ప్రధాన కూడళ్లలో కెమెరాలు బిగించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఉంటే కలిగే లాభాలను ఆయన కూలంకషంగా వివరించారు. ఈ సమావేశంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గణపురం, సెప్టెంబరు 27: భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పరుశురాంపల్లిలో గండ్ర సమ్మారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రావు, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 27: భూపాలపల్లి పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 5, 6వ వార్డుల్లోని కృష్ణకాలనీ, యాదవకాలనీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు ఫేజ్-5 కింద రూ.55 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఏమాత్రం సదరు కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారం చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు రవీందర్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), సెప్టెంబరు 27: దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక కార్యక్రమంలో ఆయన కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికిప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన నిబంధనల ప్రకారం కొంత మేర మాత్రమే దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో 1.40 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఉంటుందని, కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, సీడీపీవో అవంతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

భూపాలపల్లి కలెక్టరేట్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆలోచనలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆట, పాటల ద్వారా తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనేక పథకాలను అమలుచేస్తుందని, ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారులదే ముఖ్య పాత్ర అన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

పెస కోఆర్డినేటర్ ప్రభాకర్

మేడారం, సెప్టెంబరు 27: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని ఏటూరునాగారం ఐటీడీఏ పెస కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ ఆదివాసీ మ్యూజియం క్యూరేటర్ కురుసం రవి ఆధ్వర్యంలో వనదేవతల గద్దెల సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానం పట్ల జాగృతం పరిచేలా పుస్తక ప్రచురణ, డాక్యుమెంటరీ రూపొందించాలని అన్నారు. ప్రకృతి స్వరూపమైన సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకోవడానికి మేడారం వచ్చే భక్తులను అబ్బురపరిచేలా రూపొందిచనున్నట్లు తెలిపారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడుతూ సంవత్సరంలో ఆదివాసీలు ప్రత్యేకంగా జరుపుకునే పండుగల వివరాలు, ఆదివాసీ జానపద గీతాలు, రేలా నృత్యాలు వంటి వాటిపై డాక్యుమెంటేషన్ ప్రారంభించడం జరుగుతుం దన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సమావేశంలో పూజారులు బుక్కయ్య కృష్ణయ్య రఘుపతిరావు, అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు భోజరావు, నాయకులు రాణా రమేష్, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటాం

ఏటూరునాగారం, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కంకణాల గీతిక(6) విషజ్వరంతో వారం రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన గీతిక తల్లిదండ్రులకు స్థానిక యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు గజ్జల సుమన్ ఆధ్వర్యంలో రూ.15వేలను సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యులు శ్రీరాం, రాజుకుమార్, మహమ్మద్ మున్న, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యతపై అవగాహన

వాజేడు, సెప్టెంబరు 25: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గత మూడు రోజులుగా పంపు ఆపరేటర్లకు వివిధ అంశాలపై శిక్షణను ఇస్తున్నారు. శుక్రవారం నీటి నాణ్యతపై అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, ఆర్‌వో వాటర్‌పై అవగాహన కల్పించారు. భూగర్భ జలాల్లో అధికంగా ఖనిజాలు లభిస్తాయని ఆ నీటిని తాగడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, ఆ నీరు లేనిపక్షంలో శుద్ధి చేసిన మిషన్ భగీరథ నీరు శ్రేయస్కరమన్నారు. ఆర్‌వో వాటర్ తాగటం వలన ఎటువంటి పోషకాలు లభించకపోగా పలు రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే ఆస్కారం ఉందని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో జేఈ శైలజ, కెమిస్ట్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రకు తరలిన విద్యార్థులు

ములుగు, సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని ములుగు, వెంకటాపూర్ కేజీబీవీ విద్యార్థులను పర్యాటక శాఖ అధికారులు విజ్ఞాన విహార యాత్రకు తీసుకువెళ్లారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, రామప్ప దేవాలయాలను సందర్శించారు. విద్యార్థులు తరలివెళ్లిన బస్సులను ములుగులో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, టూరిజం గైడ్‌లు గోరంట్ల విజయ్‌కుమార్, వెంకటేష్, సేవా టూరిజం సభ్యులు శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో చిచ్చు పెట్టొద్దు

ఏటూరునాగారం, సెప్టెంబరు 27: ఎస్సీ వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టకూడదని మాలల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గంపల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాలల ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగ రాజుపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకుల తీరును ఖండిస్తూ నిరసన తెలిపారు. కొందరు ఎమ్మార్పీఎస్ నాయకులు రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. మాల మాదిగల మధ్య సున్నితమైన అంశం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు గుండాల రఘు, కరమ్‌చంద్ గాంధీ, వేల్పుల సమ్మక్క, కొమ్మిరి రమేష్, కాళ్ళ రామకృష్ణ, హరికృష్ణ, మాదరి మధు, మాదరి రాంబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా జన్మదినం

ఏటూరునాగారం, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో శుక్రవారం సాయిబాబా జన్మదిన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు ఎల్లాప్రగడ భానుప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే మంచామృత, అభిషేకాలు, అర్చనలు, పలు రకాల పండ్లతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో కలాకండ్‌తో తయారు చేసిన బాబా పేరుపై కేక్ కటింగ్ చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం మహా అన్నప్రసాద వితరణతో పాటు సాయంత్రం స్వామి వారిని పురవీధుల గుండా పల్లకిలో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చు సతీశ్, కోశాధికారి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గంజి రమేష్, ఆలయ పర్యవేక్షకులు నరసింహారావు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది'

మంగపేట, సెప్టెంబరు 27: అహర్నిశలు కష్టపడి పార్టీ బలోపేతానికి కారకులైన కార్యకర్తలు, నాయకులకు రాష్ట్ర నాయకత్వం అండగా ఉంటుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, మల్లూరు మొట్లగూడెం, గాంధీనగర్, నర్సింహసాగార్, నరేంద్రావుపేట, కొత్తమల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం, రమణక్కపేట, రాజుపేట, కత్తిగూడెం, బ్రాహ్మణపల్లి, అకినేపల్లి-మల్లారం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నాగజ్యోతి విస్తృతంగా పర్యటించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ సభ్యత్వం పొంది అకాల మరణం చెందిన కుటుంబాలకు చెక్కులను అందజేసి ఓదార్చారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు పోరిక గోవిందనాయక్, మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ నరేందర్ యాదవ్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, నాయకులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు ఉపయోగిస్తున్న హోటల్‌కు జరిమానా

కాటారం, సెప్టెంబరు 27: మండల కేంద్రంలో పాలిథిన్ కవర్లు వాడుతున్న హోటల్ యజమానికి ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి రూ.2వేల జరిమానా విధించారు. శుక్రవారం పలు దుకాణాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్‌లో అధికారులు తనిఖీలు చేశారు. 50 మైక్రాన్‌కు పైగా మందం ఉన్న కవర్లు వాడాలన్నారు. జీపీ కార్యదర్శి సమీర్ ఖాన్, సిబ్బంది దోమల శ్రీనివాస్, బ్రహ్మం, అర్జున్, రమేష్, సత్యం పాల్గొన్నారు.

భావితరాల కోసం అందరూ పాటుపడాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 27: ప్రస్తుతం సంభవిస్తున్న వరదలను, సునామీలను, భూతాపాలకు భయపడకుండా ఉండి ఆపదలో ఉన్నవారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని జిల్లా మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు చౌలం శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, ఎక్కెల ప్రాథమిక పాఠశాల, మానసపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా, పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేస్తూ వైజంక్షన్ నుంచి ఏటూరునాగారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పాఠశాల, విద్యార్థులకు వస్తువుల అందజేత

కాటారం, సెప్టెంబరు 27: మండలంలోని గంగారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాజా మాజీ సర్పంచ్ తెప్పల దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత తెప్పల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం వస్తు సామగ్రితో చేయూతనందించారు. ఇటీవల పాఠశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సందర్శించిన సమయంలో పీఎస్ విద్యార్థులకు ఏం కావాలని అడగగా స్కూలు బ్యాగులు, బూట్లు, వాటర్ బాటిల్స్, జడ్పీహెచ్ఎస్ వంట నిర్వాహకులు తమకు గ్యాస్ స్టౌ, సిలిండర్ కావాలని కోరారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు పక్కనే ఉన్న మాజీ సర్పంచ్ దేవేందర్, అతడి సోదరుడు ప్రభాకర్‌లతో వాటిని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. దీంతో రూ.18వేలతో తెప్పించిన స్కూల్ బ్యాగులు, షూస్, వాటర్ బాటిల్స్, గ్యాస్ స్టౌ, సిలిండర్‌లను దాతలు కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, మాజీ ఎంపపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మాలతి, రాంబాబు, కృష్ణవేణి, పలువురు మాజీ సర్పంచులు నవీన్‌రావు, అందె సత్యనారాయణ, ప్రభాకర్, శ్రీధర్, రాజు, నాయకులు గద్దల రమేష్, భూపెల్లి రాజు, శశికుమార్, ఆత్మకూరి కుమార్, కొమురయ్య, బాపు, రాజబాపు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులు, ఉపాధ్యాయులతో డీఎస్పీ, సీఐ, దాతలు, నాయకులు

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

కాటారం, సెప్టెంబరు 27: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ దార్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ విగ్రహానికి పలువురు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, పద్మశాలి సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు, పులిహోర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గంలో ముందుకెళ్తూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కొండా లక్ష్మణ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రావు, జాడి మహేశ్వరి, బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ నేతలు చీమల రాజు, గడ్డం కొమురయ్య, ఆత్మకూరి కుమార్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య, నాయకులు ఎలబాక సుజాత, మాచర్ల రాజేందర్, అశోక్, పల్నాటి బలరాం, గట్టయ్య, గాదె రమేష్, వలుస వెంకటేశ్వర్లు, రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కాటారంలో వేడుకల్లో డీఎస్పీ, సీఐ, సంఘం నాయకులు

● మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయదేవి, అధ్యాపకులు రవీందర్, నరేందర్, ప్రవీణ్, కరుణాకర్, స్వరూపరాణి, నరేష్, రవి, ఉమామహేశ్వరి ఆఫీస్ సిబ్బంది రాములు, కిరణ్, షబ్బీర్ పాల్గొన్నారు.

బిల్ట్ ఫ్యాక్టరీ వద్ద విద్యుత్ వినియోగ లొల్లి

▸▸ పరికరాల తొలగింపు పనుల్లో దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆరోపణలు

▸▸ అక్కడికి వెళ్లిన ఉద్యోగులు, పాత్రికేయుల అడ్డగింత

మంగపేట, సెప్టెంబరు 27: మండలంలోని కమలాపురం బిల్ట్ కర్మాగారంలోని పరికరాల తొలగింపు పనులను చేపట్టిన సంస్థ తొలగింపు పనుల కోసం విద్యుత్‌ను వినియోగించే విషయంలో అక్రమానికి పాల్పడుతోందనే విషయం మరోసారి వివాదానికి దారి తీసింది. ప్రైవేట్ షాపుల నుంచి విద్యుత్‌ను వినియోగిస్తున్న క్రమంలో రెండునెలల క్రితం విద్యుత్ అధికారులు దాడులు చేసి ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి, అపరాధ రుసుం వసూల్ చేశారు. ఇక నుంచి అక్రమంగా విద్యుత్‌ను వాడొద్దని హెచ్చరిక చేయడంతో కొంతకాలం వివాదం సద్దుమణిగింది. కానీ మళ్లీ అదే ప్రైవేట్ షాపు నుంచి విద్యుత్‌ను వాడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం రాత్రి ఆ ప్రాంతానికి వెళ్లగా ఫ్యాక్టరీ సిబ్బంది వారిని లోపలకు వెళ్లనీయలేదు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన పాత్రికేయులను కూడా అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. అలా గంటపాటు నిరీక్షించిన అనంతరం విద్యుత్ ఉద్యోగులను, ఏఈని ఉద్యోగులు లోపలికి అనుమతించారు. కానీ అప్పటికి అక్రమ కనెక్షన్ లేకుండా చేసినట్టు తెలిసింది. గంటన్నర తర్వాత విద్యుత్ ఏఈతో పాటు ఉద్యోగులు బయటకు వచ్చి లోపల ఏమీ లేదని, తమకు అనుమానాలున్నాయని చెప్పడం గమనార్హం. ఇదే విషయంపై పోలీసులు కూడా విచారణ చేస్తున్నారు.



బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధాన గేట్ వద్ద విద్యుత్ అధికారుల పడిగాపులు

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు

గణపురం, సెప్టెంబరు 27: మండల విద్యాధికారిగా ఉప్పలయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ధర్మరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ఉప్పలయ్యను సీనియారిటీ నేపథ్యంలో ప్రభుత్వం ఎంఈవోగా పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్, పీఆర్‌టీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంఈవో ఉప్పలయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘాల నాయకులు గోస్కుల వీరన్న, రఘునాథ్‌రెడ్డి, సతీష్, పబ్బ శంకర్, గుంట సాంబయ్య, భానుచందర్ పాల్గొన్నారు.

● కాటారం: మండల విద్యాధికారిగా ఇంజపల్లి శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖ మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్న దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎం శ్రీదేవిని ఎంఈవోగా నియమిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో శ్రీదేవి ఎంఈవోగా విధుల్లో చేరారు. ఎంఈవోకు కార్యాలయ సిబ్బంది ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ గద్దల సుదర్శన్, సీసీవో సిరిసిల్ల వరప్రసాద్, సీఆర్పీలు తిరుపతిరెడ్డి, రవి శంకర్, శ్రీనివాస్, ఐఆర్పీలు సత్యనారాయణ, సతీష్, ఓఎస్ పున్నం సురేష్ శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానం చేశారు. నించారు.

● మహాముత్తారం: మహాముత్తారం ఎంఈవోగా పాశం సంజీవరెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బందిసన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి పనితీరును మరింత మెరుగు పరుస్తానని అన్నారు.


గణపురం ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

● మల్హర్: మండల నూతన విద్యాధికారిగా లక్ష్మణ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతానికి ఉపాధ్యాయులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు, నరసింగరావు, సుదర్శన్,తిరుపతి,ఉపాధ్యాయులు సన్మానించారు.

● తాడ్వాయి: మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రేగ కేశవరావును ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం సన్మానించారు. మండల విద్యావనరుల కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం క్రిష్ణయ్య మండల అధ్యక్షుడు జన్ను శ్యాసన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోరిక శంకర్, బత్తుల సతీష్, బిల్ల స్రవంత్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కె.నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పి.భుజంగరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.బాబూరావు, కార్యదర్శి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరంతో టెన్త్ విద్యార్థి మృతి


చరణ్ మృతదేహం

కన్నాయిగూడెం, సెప్టెంబరు 27: కన్నాయిగూడెం మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన కోరం చరణ్(15) అనే పదవ విద్యార్థి విషజ్వరంతో గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన ప్రకారం... కోరం బాబు-శ్రీలత దంపతుల కుమారుడు చరణ్ ములుగు మండలం ఇంచర్లలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. గురుకులం నిర్వాహకుల ద్వారా సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు చరణ్‌ను తీసుకుని ఏటూరునాగారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. మెరుగైన వైద్యం హనుమకొండకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, జ్వరంతో బాధపడుతున్న కోరం చరణ్‌ను పాఠశాల యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్లనే చనిపోయాడని ఏఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్ అన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

▸▸ రిమాండ్‌కు నిందితుడి తరలింపు

కన్నాయిగూడెం, సెప్టెంబరు 27: మండలంలోని ఏటూరు గ్రామంలో అత్తగారింటి వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్న తాడ్వాయి మండలం కాటాపూర్‌కు చెందిన లంజపెల్లి రవికుమార్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 23న కూలి పనులకు వెళ్లిన రవికుమార్ ఇంటికి రాకపోవడంతో మామ లక్ష్మయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయగా, మరుసటి రోజు 24న కంతనపల్లి శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. చేతి మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా మృతదేహం రవికుమార్‌దేనని కుటుంబ సభ్యులు నిర్ధారణ చేశారు. పనులకు తీసుకుపోయిన పుట్ట రమేష్ అనే రైతును పోలీసులు విచారించగా విషయం బయట పెట్టాడు. చేనులో ట్రాక్టర్‌తో దున్నే క్రమంలో రోటవేటర్ భూమిలోకి దిగటం లేదని రవికుమార్‌ను రోటవేటర్‌పై కూర్చుని గట్టిగా పట్టుకొమ్మని చెప్పి రమేష్ ట్రాక్టర్ నడుపుతున్నాడు. రవికుమార్ రోటవేటర్‌లో పడి చనిపోయాడని వివరించారు. తదుపరి సాక్ష్యాధారాలు లేకుండా చేయడానికి ప్రయత్నం చేశాడన్నారు. నిందితుడు నేరాన్ని ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన విద్యార్థిని

▸▸ రామాంజాపూర్ ఆశ్రమ పాఠశాలలో ఘటన


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంధ్య

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 27: మండలంలోని రామాంజాపూర్ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని లావుడ్య సంధ్య(10) శుక్రవారం విద్యుదాఘాతానికి గురైంది. సకాలంలో స్పందిన హాస్టల్ వార్డెన్ జానోత్ సమ్మయ్య వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఉదయం 7గంటల సమయంలో సంధ్య బట్టలు ఆరేస్తుంది. పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి మరో నాలుగు నివాస గృహాలకు కనెక్షన్లు ఉన్నాయి. ఆ సర్వీసు వైర్లకు తీగ తగిలి ఉండటం వల్ల సరఫరా జరిగి విద్యార్థిని విద్యుదాఘాతానికి గురైంది. స్పందించిన వార్డెన్ విద్యార్థినిని వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించారు. సంధ్యకు ముఖం, రెండు చేతులకు స్వల్ప గాయాలయ్యాయని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ సదానందం వెంటనే చెంచుకాలనీ ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. గత నెల రోజుల నుంచి స్తంభాన్ని తొలగించాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా నిర్లక్ష్యం చేశారని, స్థానికులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకువచ్చారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

కాకతీయఖని, సెప్టెంబరు 27: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సింగరేణి లాభాల వాటాపై ఇతర సంఘాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొంత మంది పనిగట్టుకుని ఏఐటీయూసీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అలాంటి సంఘాలను సింగరేణిలో నామరూపాలు లేకుండా చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులు పొందుతున్న లాభాల వాటా ఏఐటీయూసీ ఘనతేనన్నారు.నాయకులు రమేష్,రామ్‌చందర్,సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.